క్లుప్తంగా

ఆడికృత్తిక ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ విజ్ఞానగిరిపై ఉన్న కుమార స్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక ఉత్సవాల ఏర్పాట్లను పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, డీఎస్పీ భీమారావు పరిశీలించారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ సామాన్య భక్తుల తోపాటు వీఐపీలకు దర్శనం కల్పించేలా క్యూలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తలనీలాలు సమర్పించే భక్తులకు నారద పుష్కరిణిలో స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



ర్యాలీ చేస్తున్న చేనేత కార్మికులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని భాస్కర్ పేటలో సోమవారం జాతీయ చేనేతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. చేనేత కార్మికులు మాట్లాడుతూ ప్రాచీన సంప్రదాయ వృత్తి అయిన చేనేత పరిశ్రమకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కన్నా వెంకటేశ్వర్లు, చంద్రయ్య, శంకరయ్య, వెకంటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను సిద్ధం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో త్వరలో చేపట్టనున్న భూముల రీసర్వే కోసం రికార్డులను పక్కాగా సిద్ధం చేయాలని తహసీల్దారు భార్గవి తెలిపారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో భూముల రీసర్వేపై వీఆర్ఓలు, సచివాలయాల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూవివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే రైతులకు ఓ వరమని, రైతులంతా భూముల రీసర్వేకు సహకరించాలన్నారు. రీసర్వేలో అన్ రిజిష్టర్డ్, వంశపారంపర్య భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామన్నారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారని చెప్పారు. డీటీ శివయ్య, ఆర్ఐ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

గిట్టుబాటు కూలి కల్పించండి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : కూలీలకు గిట్టుబాటు కూలి లభించేలా ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం తాటిపర్తి పంచాయతీలో చెరువు నీటి గుంత పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు రోజుకు రూ.272 కూలి లభించేలా పనులు కల్పించాలన్నారు. పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఏపీవో సుజాత పాల్గొన్నారు. అలాగే మండలంలోని చిటత్తూరులో జరుగుతున్న అమృత సరోవర్ పనులను సీనియర్ డాక్యుమెంటరీ ప్రిపరేటరీ లీలావతి పరిశీలించారు. చెరువు కింద ఎంత మంది రైతులు ఉన్నారు. చెరువు పూడికతీత పనుల వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ఏర్పేడు: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఏర్పేడు సీఐ శ్రీహరి ఆదేశించారు. ఆయన సోమవారం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు.

పకడ్బందీగా ఓటరు సర్వే

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : మండలంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను సర్వే చేయాలని తహసీల్దార్ ఎర్రంరెడ్డి సుధీర్‌రెడ్డి బీఎల్‌వోలను ఆదేశించారు. ఆయన సోమవారం బీఎల్ఓలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. మృతి చెందిన, వలస వెళ్లిన, పెళ్లి అయి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రమేష్ బాబు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మురళీధర్, సుజాత, ఆర్ఐ నాగరాజు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో గత నెల 21వ తేదీ నుంచి జరుగుతున్న సమగ్ర ఓటరు సర్వేను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి తెలిపారు. గ్రామంలోని 12 జోర్ నంబర్లను సరి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎల్ఓ, వీఆర్ఓ ప్రసాద్, పాల్గొన్నారు.

స్కూటరిస్టుకు గాయాలు

ఏర్పేడు: మండలంలోని గోపాలపురం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు.. శ్రీకాళహస్తికి చెందిన సుబ్రమణ్యం(45) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళ్లి తిరిగి వస్తుండగా గోపాలపురం వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముత్తుకుమార ఆలయానికి ఆడికృత్తిక శోభ



రామగిరిలో కొండ కింద ముస్తాబైన శ్రీ కాలభైరవ స్వామి ఆలయం



రామగిరిలో తెప్పోత్సవాలకు ముస్తాబైన ఆలయ వెలుపలి పుష్కరిణి

- నేటి నుంచి రామగిరిలో ఆడికృత్తిక తెప్పోత్సవాలు
- 8న భరణి, 9న కృత్తిక, 10న రోహిణి ఉత్సవాలు
- 50 వేల మంది భక్తులు రావొచ్చని అంచనా
- అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్న ఆలయ పాలకమండలి

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత ముత్తుకుమార స్వామి ఆలయంలో మంగళవారం నుంచి తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. తెప్పోత్సవం నిర్వహించే పుష్కరిణిలో పాత నీటిని బయటకు పంపి శుభ్రం చేసి కొత్త నీటితో నింపారు. ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంగళవారం భరణి, బుధవారం కృత్తిక, గురువారం రోహిణి అభిషేకాలు ఈ మూడు రోజులు సాయంత్రం వేళల్లో ఆలయ పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. గతేడాది 50 వేల మంది భక్తులు తెప్పోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు వివరించారు. అందుకు అనుగుణంగా ఈ ఏడాది కూడా వసతులు, ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తెప్పోత్సవాలు జరిగే మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి టీటీడీ వారిచే భక్త మార్కండేయ హరికథా కాలక్షేపం నిర్వహిస్తామన్నారు.

భరణి రోజే అష్టమి రావడం విశేషం..

మంగళవారం భరణి రోజే అష్టమి రావడం విశిష్టత. ఈ ఆలయం పల్లవుల కాలం నాటి ప్రసిద్ధి చెందిన ప్రాచీన ఆలయం కావడం విశేషం. రామగిరి కొండపై వెలసిన శ్రీ ముత్తుకుమార స్వామి ఆలయంలో భరణి ఉత్సవాలు నిర్వహిస్తుండగా, కొండ కింద ఉన్న కాలభైరవ క్షేత్రంలో అష్టమి పూజలు జరుగుతాయి. ఈ రెండు పర్వదినాలు ఒకేరోజు రావడంతో భక్తులు అధిక సంఖలో పాల్గొనే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే, పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రాక..

ఆడికృత్తిక తెప్పోత్సవాల్లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా పాల్గొననున్నట్లు ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. తెప్పోత్సవాలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

పేదల జీవితాల్లో వెలుగులే లక్ష్యం



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం పాత వీరాపురం పంచాయతీలోని పాతవీరాపురం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని 510 కుటుంబాలను కలిశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పాతవీరాపురం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మురుగు కాలువలు నిర్మించాలని, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబమూ లబ్ధిపొందినట్లు వివరించారు. సంక్షేమ పథకాలతో జగనన్నకు ప్రజల నుంచి వచ్చే ఆదరణ చూసి చంద్రబాబు నాయుడు ఓర్వలేక అల్లర్లను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీని భూస్థాపితం చేస్తారన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచు మంజుల, ఉప సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, అధికార ప్రతినిధి మునికష్టారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహనే లక్ష్యం



బహుమతి ప్రదానం చేస్తున్న సురేష్

శ్రీకాళహస్తి: విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కంప్యూటర్ లిటరసీ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్టు ఎలక్ట్రో స్టీల్ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సురేష్ తెలిపారు. ఎలక్ట్రోస్టీల్ సీఎస్ఆర్ నిధులతో శ్రీకాళహస్తి మండలం తొండమనాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న 257మంది విద్యార్థులకు 2022 జూన్ నుంచి 2023 ఏప్రిల్ వరకు కంప్యూటర్ లిటరసీ ప్రోగ్రాం నిర్వహించారు. సోమవారం శిక్షణలో ప్రతిభ కనబరచిన 14 మంది విద్యార్థులకు బహుమతులు, కోర్సు మెటీరియల్ అందజేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి


ఏర్పేడు: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎండీహెచ్ ఎడ్యుకేషనల్, ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పవన్ కల్యాణ్ అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే కళాశాల కామర్స్ అధ్యాపకుడు రామాంజులు విద్యార్థులకు కామర్స్ పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు మాణిక్యం, రాజశేఖర్, అధ్యాకులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల వితరణ

వరదయ్యపాళెం: సత్యవేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 1959 బ్యాచ్‌కు చెందిన నేస్తం సభ్యులు వరదయ్యపాళెం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు తెలుగు, గణితం, ఆంగ్ల సబ్జెక్టులకు చెందిన నోటు పుస్తకాలను వితరణగా అందజేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నేత కార్మికులకు నేతన్న నేస్తం మెగాచెక్కును అందజేస్తున్న ఆదిమూలం

నారాయణవనం: చేనేత రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, నేతన్నలను ఆదుకున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నారాయణవనంలో ఆయిదో విడత నేతన్న నేస్తం లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రెండేళ్ల కరోనా కష్టాలను అధిగమించి ఏడాదికి రూ.24 వేలను అందించిన సీఎం జగనన్న మేలును నేతన్నలు మరవకూడదని అన్నారు. నారాయణవనం చేనేత వస్త్రాలకు ఎంతో డిమాండ్ ఉండేదన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు పాలనలో చేనేత సంఘాలు నష్టాలతో నడవడమే కష్టమైపోయిందన్నారు. చేనేత జౌళిశాఖ ఏడీ సుబ్బనాయుడు మాట్లాడుతూ నేత ఉత్పత్తుల కొలుగోలుకు, మగ్గాల ఆధునీకరణకు 5 విడతలుగా రూ.1.2 లక్షలను జమ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. సత్యవేడు నియోజకవర్గంలో 1,632 మందికి నేతన్న నేస్తం, 1,575 మందికి వైఎస్సార్ ఆసరా పెన్షన్ అందుతోందన్నారు. 50 ఏళ్లు దాటితే చేనేత పెన్షన్ అందిస్తున్నామని అన్నారు. నారాయణవనం మండలంలో 396 మంది నేతన్న నేస్తం ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో 190 మంది టీడీపీ మద్దతుదారులు, కార్యకర్తలే ఉన్నారని అన్నారు. సమావేశంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ సొరకాయలు, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బాబు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, ఏకాంబరం, ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీళ, జౌళిశాఖ ఏడీలు సుబ్బానాయుడు, కరుణకుమారి, నేత కార్మికులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో అధిక లాభాలు



విత్తన కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: విలువైన పోషకాలతో కూడిన చిరుధాన్యాలను సాగుచేయడం ద్వారా రైతులు అధిక లాభాలను గడించవచ్చని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ప్రధాన మంత్రి అజయ్ పథకంలో భాగంగా ఎస్సీ రైతులకు చిరుధాన్యాల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నీటి వనరులతో చిరుధాన్యాలను, కూరగాయలను సాగుచేయడం ద్వారా ప్రతి రోజూ ఆదాయాన్ని గడించవచ్చన్నారు. నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయ పద్దతులతో కాలుష్యరహిత కూరగాయలను, చిరుధాన్యాలను సాగు చేసేలా సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలని సూచించారు. జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఏడీ నరసింహులు, ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం మునిరత్నం మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో 379 మంది ఎస్సీ రైతులకు రూ.9,500 విలువైన 14 రకాల పెరటి కూరగాయల విత్తనాల కిట్లను, పీఎండీఎస్ కిట్లను అందజేస్తున్నామని అన్నారు. రసాయనాలను వాడకుండా ప్రకృతి, సేంద్రియ విధానాల సాగుతో పుడమితో పాటు వాతావరణం కాలుష్యం బారిన పడదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, ఏకాంబరం, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైన మహిళా పోలీసు చట్టం తీసుకురావాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మహిళా పోలీసులు

శ్రీకాళహస్తి: సరైన జాబ్ చార్ట్ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు పడుతున్నామని మహిళా పోలీసులు తెలిపారు. వారు సోమవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిశారు. వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పటిష్టమైన పోలీసు చట్టం తీసుకురావాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మహాలక్ష్మి, రత్నమాలిని, లక్ష్మి, చాముండేశ్వరి, బత్తెమ్మ, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

జీసస్ అపోస్థలిక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: రేణిగుంట జీసస్ అపోస్థలిక్ చర్చి 31వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమెను చర్చి పెద్దలు డేవిడ్ చంద్రన్ ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, గంగారి రమేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, శశికిరణ్, రసూల్, ఖదీర్, ఇరానీ ఖాదర్ పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం




మాట్లాడుతున్న సర్పంచ్ రూబెన్

సత్యవేడు/బుచ్చినాయుడుకండ్రిగ/నాగలాపురం /వరదయ్యపాళెం: తల్లిపాలతోనే బిడ్డకు సమతుల్య ఆహారం అందుతుందని పెద్ద ఈటిపాకం సర్పంచ్ రూబెన్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు బిడ్డకు ఆర్నెళ్లు ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డ రక్తహీనతను అధిగమించే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అంతకుముందు వారోత్సవాల్లో భాగంగా గ్రామ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త లు, పుట్టిన శిశువుకు గంట లోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని, తల్లులు తప్పనిసరిగా బిడ్డలకు పాలు తాగించాలని అన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

శ్రీకాళహస్తి/రేణిగుంట: శ్రీకాళహస్తి రూరల్ మండలంలో ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ నేపథ్యంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ, ప్రజాప్రగతి ట్రస్టు, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా తల్లిపాల ఆవశ్యకతను వివరించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ



గాయపడిన శివ

నాగలాపురం: అమ్మవారికి అంబలి పోసే విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని గోల్లవారికండ్రిగ గ్రామానికి చెందిన సర్వేశ్వరయ్య కుమారుడు జి.శివ, అతని అనుచరులు గ్రామ దేవత గంగమ్మకు అంబలి పోయాలని అనుకున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన జి.ధనుంజయలు, లోకయ్య, నారాయణస్వామి తదితరులు కూడా అదేరోజు అమ్మవారికి అంబలి పోయాలని భావించారు. అయితే ఇరువర్గాల వారికి గతంలో నుంచి వివాదాలు ఉండడంతో గ్రామస్తులంతా చర్చించి మరొక రోజు కార్యక్రమం నిర్వహించుకోవాలని నిర్ణయించారు. అయితే గ్రామానికి చెందిన ఎస్.వెంకటేశులు, జి.ధనుంజయలు, లోకయ్య తమిళనాడు నుంచి పలువురు రౌడీలను రప్పించి ఆదివారం ఉదయం గంగమ్మ ఆలయం వద్దకు వచ్చిన అవతలి వర్గం వారిని రెచ్చగొట్టారు. గ్రామస్తులు గొడవ వద్దని వారిస్తున్నా వినకుండా తమిళనాడు నుంచి వచ్చిన రౌడీలు అక్కడే ఉన్న శివ తలపై కత్తితో దాడి చేయడంతో అతను స్పృహ తప్పి పడిపోయాడు. తీవ్ర రక్త గాయాలతో ఉన్న శివను వెంటనే నాగలాపురం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యంకోసం నగరి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితులు నాగలాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హంస వాహనంపై కుమారస్వామి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆలయానికి అనుబంధ ఆలయమైన విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు హంస వాహనంపై ఊరేగారు. అలంకార మండపంలో శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామికి విశేష అభిషేకాలు చేశారు. స్వామివారు హంసవాహనంపై దర్శనమిచ్చారు.

ఘనంగా లక్ష్మణస్వామి వర్మ జయంతి



లక్ష్మణస్వామి వర్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని పెండ్లి మండపం వద్ద సోమవారం వన్నెకుల క్షత్రియుడు పొన్న మండల లక్ష్మణస్వామివర్మ జయంతిని వన్నెరెడ్డి జాగృతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన గొప్పతనాన్ని వివరించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మధురెడ్డి, రత్నంరెడ్డి, బుజ్జిరెడ్డి, పెరుమాల్‌రెడ్డి, మప్పేటి సుబ్రహ్మణ్యంరెడ్డి, చింతకాయల సుధాకర్‌రెడ్డి, మల్లెంబాకం మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ

శ్రీకాళహస్తి: మండలంలోని వాగివేడు గ్రామానికి చెందిన పలువురు దళితులు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం వైఎస్సార్‌సీపీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలిపారు. 70 మందికి పైగా టీడీపీని వదిలి వైఎస్సార్‌సీపీలో చేరారు.

నూలు వస్త్రాలకు ప్రాధాన్యం ఇవ్వండి

నారాయణవనం: సంప్రదాయ నూలు వస్త్రాలను ప్రోత్సహించడానికే మహాత్మాగాంధీ విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమాన్ని తీసుకువచ్చారని, అందుకే ప్రతి ఒక్కరూ సంప్రదాయ నూలు వస్త్రాలను ధరించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంఈఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలను నిర్వహించి, నూలువస్త్రాల ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు. బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈఓ–2 గోవిందస్వామి మాట్లాడుతూ కృత్రిమ నూలుతో తయారయ్యే వస్త్రాలు శరీరానికి హాని కలిగిస్తాయన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు చేనేత వస్త్రాలను ధరించి విచ్చేశారు. ఈ సందర్భంగా స్వదేశీ చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను ఎంఈఓ హేమమాలిని వివరించారు.

రావణబ్రహ్మపై కుమారస్వామి విహారం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లు రావణ బ్రహ్మ వాహనంపై ఊరేగారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం రావణ బ్రహ్మ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు పాల్గొన్నారు.

పళ్లిపట్టు నాగరాజుకు సత్కారం




పళ్లిపట్టు నాగరాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వరదయ్యపాళెం: కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పళ్లిపట్టు నాగరాజును సోమవారం వరదయ్యపాళెం హైస్కూల్‌లో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన అంతర్జాతీయ సాహిత్య ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వరదయ్యపాళెం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి అయిన నాగరాజుకు అంతర్జాతీయ ఉత్సవాలకు ఆహ్వానం అందడం గర్వకారణమని తెలిపారు. హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ద్రౌపదీదేవి దర్శనం

నారాయణవనం: మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం మండలంలోని తిరువట్యం పురవీధుల్లో ద్రౌపదీదేవి పాండవుల సమేతంగా దర్శనమిచ్చారు. నారాయణవనంలో మహాభారత ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి.

అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాలు పెంపు



కూలీలతో మాట్లాడుతున్న లీలావతి

ఏర్పేడు: ఉపాధి హామీ కింద చేపట్టే అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాలు పెరుగుతాయని సీఆర్డీ సీనియర్ డాక్యుమెంటరీ ప్రిపరేటరీ లీలావతి అన్నారు. మండలంలోని బండారుపల్లిలో సోమవారం అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకులు మనోహర్, పట్టాభిరెడ్డి, రవీంద్రుడు, క్షేత్ర సహాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.